


# చెదలు

ప్రశాంత్ చనిపోయి పదిరోజులైంది

*                    *                    *

నలభై రెండేళ్ళ నీరజ భద్రకాళి చెరువు ఒడ్డుపై, ముడుచుకూర్చుని, మోకాళ్ళనడుమ ముఖాన్ని దాచుకుని..నిశ్శబ్దంగా గుండెల్లోనుండి ఎగదన్నుకునివస్తున్న దుఃఖాన్ని దిగమ్రింగుకునే ప్రయత్నం చేస్తూ..విఫలమౌతూ..నీటి కెరటాలు ఒడ్డును తాకి, విరిగి మళ్ళీ వెనక్కి మళ్ళుతున్న ఒక చిత్రమైన ధ్వని..

అది తప్ప అంతా నిశ్శబ్దం.

ఆమె పదిరోజులుగా ఎవరితోనూ మాట్లాడలేదు...మౌనంగానే ఉంది.

ఎక్కడో ఓ పుస్తకంలో చదివిన వాక్యాలు గుర్తొచ్చాయామెకు.. 'మౌనమంటే వ్యూహం..మౌనమంటే తపస్సు..మౌనమంటే కుట్ర...

మౌనమంటే దుఃఖం..మౌనమంటే ధనుస్సును వంచి శక్తివంతంచేసి బాణాన్ని లక్ష్యంవైపు గురిచూచి సారించే అల్లెతాడు. మౌనమంటే..'

ఇప్పుడు తన విషయంలో మాత్రం మౌనమంటే దుఃఖమే.

దుఃఖం పొరలు పొరలుగా, అలలు అలలుగా విస్తరిస్తూ మనిషిని ఆవర్తిస్నుపుడు గాలికి ప్రకంపిస్తున్న లేత రావి ఆకులా మనసు..దుఃఖాన్ని అనుభవించినవాళ్ళకే దానిలోతు తెలుస్తుందా.?

నిజానికి ప్రేమకంటే దుఃఖమే బలమైందా.?

అకస్మాత్తుగా నీరజ ఎక్కెక్కిపడి ఏడ్చింది.. కళ్ళు తెరువగానే టపటపా రాలిన కన్నీళ్ళ తెరల్లోనుండి పదిరోజుల క్రితం తను యిక్కడికి వచ్చినపుడు.,

ఒడ్డున ప్రశాంత్ విడిచిన బూట్లు. తను చదువుతున్న ఇంజినీరింగ్ కాలేజి ఐడికార్డ్ లూప్ ప్రక్కనే పుస్తకాల సంచి, సంచిపై కళ్ళజోడు..వాటితోపాటే గత వాడి బర్త్‌డేకి తను కొనిచ్చిన వాచ్. దానికి ఒక రబ్బర్ బాండ్‌తో రాసి అట్టిపెట్టిన ఓ కాగితం..

'అమ్మా..నేనేం చేస్తున్నానో నాకు తెలియడంలేదు. నేనిప్పుడు సుడిగాలిలో కొట్టుకుపోతున్న ఒక కాగితం ముక్కను. నన్ను క్షమించు-ప్రశాంత్'

ఆ రోజు..రాత్రంతా తాము ఇంజినీరింగ్ కాలేజీకి మామూలుగా వెళ్ళి మామూలుగా ఇంటికి తిరిగిరాని ప్రశాంత్‌కోసం వెదికి వెదికి గుండెలనిండా దిగులుతో కనలిపోతున్న క్షణం..ఎవరో ఇద్దరు కానిస్టేబుల్స్ వచ్చి 'ఈ ఐడికార్డ్ మీవాడిదేనా?' అని అడిగి చూపిన క్షణం..,

ప్రేలిపోతున్న పర్వతాలు..కూలిపోతున్న కొండలు..క్రుంగిపోతున్న భూమి.,

ఏం జరిగింది..ఎక్కడిదీ ఐడి కార్డ్..ప్రశాంత్ ఎక్కడ..

పోలీస్ జీప్‌లో...కుప్పకూలి..ప్రపంచం బ్రద్దలైపోతూ, కళ్ళ చుట్టంతా లోకం గిరగిరా తిరుగుతూ..గిరగిరా.,

ఇదే ఒడ్డుపై..బూట్లు, పుస్తకాల సంచీ..కళ్ళజోడు..

కాని మనిషేడి..గంభీరమైన భద్రకాళి చెరువు..మృత్యునిశ్శబ్దం.

'శవం ఇంకా తేలలేదు..వెదకాలి' అంటున్నారెవరో.

శవమా...ప్రశాంత్ శవమా?..శవమెందుకయ్యాడు ప్రశాంత్..ఎందుకు ..ఎలా?..ఏం జరిగింది..ఎందుకు ప్రశాంత్ ఇలా చెరువులో పడి..ఆత్మహత్యా?.. ఆత్మహత్య చేసుకోవలసిన అవసరం ప్రశాంత్‌కెందుకు.

అప్పుడే ప్రశాంత్ తన వాచ్‌కు రబ్బర్ బ్యాండ్‌తో కట్టిన కాగితాన్ని తనకిచ్చాడు కానిస్టేబుల్.

'అమ్మా..' అని సంబోధన.

ఎందుకురా తండ్రీ..ఏం జర్గిగింది నాన్నా..తెల్లని నీ పాదాలను నా

అరచేతుల్లో దాచుకుని పెంచానుకదా బిడ్డా..ఆ పాదాలతో ఈ నీళ్ళలోకి నడుచుకుంటూ వెళ్ళి..ఈ అమ్మ హృదయాన్ని చిదిమేశావుగదరా నాన్నా.. ఎందుకు..ఎందుకు..,

తర్వాతంతా తతంగం..

శవాన్ని వెదకడం..పోస్ట్‌మార్టం..పోలీస్ పంచనామా..డాక్టర్‌లకు లంచం. పోలీసులకూ వేలకొద్ది రూపాయల లంచాలు..కాలేజినుండి ఎవరో అతికొద్దిమంది విద్యార్థులు వచ్చి..శవాన్ని చూచి..

'ఫస్టియర్‌లోనే ప్రేమలు..దొంగముండాకొడ్కులు..మంచి పనిజర్గింది..' అంటున్నారెవరో.

'బాగా ఒళ్ళు కొవ్వెక్కింది'

'పోరగాండ్లు సిన్మాలుచూచి చెడిపోతాండ్లు'

'అరె..మూతిమీద మీసాలు మొల్వనేలేదు. ప్రేమలు..షోకులు.. డర్టీఫెలోస్'

నీరజ చెవులు మూసుకుంది..గింగురుమంటున్నాయి ఎన్నో మాటలు.

ఆరోజు..గోతి తీసి ప్రశాంత్ శవాన్ని లోపల దింపి..పిడికెడు మట్టిని వేస్తున్నపుడు,

అర్థంలేని చావు..ఎవరి సానుభూతీ పొందని దుర్మరణం..ఎవరూ 'అయ్యో పాపం' అనని దీనస్థితి..ఎందుకు.?

నీరజ లేచి నిలబడింది.

వేసవికాలపు సాయంసంధ్య..ఎదుట పద్మాక్షి గుట్టలపైనుండి ఎర్రగా సూర్యాస్తమయం.

సూర్యునిలోకి చూడాలని చూపులను సారించి..చటుక్కున కళ్ళనిండా చీకటి మెరుపు..తల తిరుగుతున్నట్టు, మస్తిష్కంనిండా ఏదో..ఓ అడవి కాలిపోతున్నట్టు..;

రెండు నిముషాల్లోనే...ఎక్కడినుండో పెనుగాలి..గాలి దుమారం.. కట్టపైనుండి దుమ్ము.

మెల్లగా కట్టనెక్కి..క్రిందికి దిగి..కీర్తి గార్డెన్స్..కుసుమ హరనాథ్ టెంపుల్.. నడుస్తోంది..అయ్యప్పగుడి.,

నీరజ మనసులో..బయట రోడ్డుపై ..అకస్మాత్తుగా టపటపా చినుకులు.. వేసవి వర్షం.,

పదవ తరగతిలో రాష్ట్రస్థాయి రెండవ ర్యాంక్ సాధించిన ప్రశాంత్.,

ఏక సంతాగ్రాహి..చిన్నప్పటినుండీ అంతే..ఐదవతరగతిలో వేమన పద్యాలను తను చెబుతున్నపుడు..ఒకే ఒక్కసారి దీక్షగా చదివి..కళ్ళుమూసుకుని అక్షరం తప్పుపోకుండా అప్పజెప్పేవాడు.

ఎలా సాధ్యమౌతోందిది.. అంటే నవ్వి..'టేప్ రికార్డరమ్మా..ఒకసారి రికార్డ్ చేస్తే ప్రింటవుతుంది. ఇక రివైండ్ అండ్ ప్లే అంతే..'..మళ్ళీ గలగలా నవ్వు.. నీళ్ళు కురుస్తున్నట్టు.

ఏడవ క్లాస్‌లో 'ఇంటలిజెంట్ కిడ్ ఆఫ్ ది స్టేట్' అవార్డ్..దేశాలు, రాజధానులు, దేశాధినేతలు..ప్రాంతాలు..విశేషాలు..ప్రపంచ విజేతలు..ప్రముఖ నాయకులు–జి.కె.

మీడియాలో ఎన్నో ఇంటర్వ్యూలు..'వండర్ బాయ్' ప్రశంసలు.

ఎస్సెస్సీ తర్వాత..విజయవాడలో ఓ రెసిడెన్షియల్ కాలేజివాళ్ళు..ర్యాంక్ ఆధారంగా ఉచిత విద్య, హాస్టల్, ప్రత్యేక ఇంటర్ ఐఐటీ కోచింగ్–

వృద్ధి..వికాసం..భవిష్యత్ నిర్మాణం–అదే ధ్యాస.

వెళ్ళిపోయాడు కొడుకు..వేరే ప్రపంచంలోకి.

మూడు నెలలకే యాజమాన్యం వర్తమానం పంపింది..ప్రశాంత్ ప్రతివారం ఎటో పారిపోతాడు హాస్టల్‌నుండి..మళ్ళీ తిరిగొస్తాడు రెండ్రోజులకు. తర్వాత..అదోరకమైన ప్రవర్తన..పరధ్యానంగా కూర్చోవడం..ఎటో ఆకాశంలోకి చూడ్డం...

ఏమిటి కారణం., అకస్మాత్తుగా వీడిలో ఏమిటీ పెనుమార్పు.,

'అమ్మా..ఇనుము ద్రవస్థితినుండి ముష్టిస్థితిలో ఒక ముద్దగా మిగిలి ఒక శాశ్వత రూపాన్ని పొంది యిక ఘనీభవిస్తుంది. పేస్టీఫాంలో ఎంత అలజడో. ఎంత ఘర్షణో..ఎంత అంతర్మధనమో..' అన్నాడొకసారి. అప్పుడా క్షణం ప్రశాంత్ ముఖంలో ఓ గాఢ ఉద్విగ్నత..వయసును మించిన ఏదో వ్యక్తీకరణ.

చటుక్కున ప్రశాంత్‌కు ఫిజిక్స్ చెప్పే టీచర్ ఉద్యోగం మానేసి కాకినాడ వెళ్ళిపోతే.. హాస్టల్‌నుండి మాయమై కాకినాడ వెళ్ళాడు..ఏంజేశాడు..అక్కడ ఎక్కడో రైల్వేస్టేషన్‌లోనో, బస్టాండ్‌లోనో ఉంటూ రోజూ ఆమె ఇంట్లోనుండి బయటికి వచ్చినపుడు వెంట నడచి చూస్తూ వెళ్ళేవాడట.

రెండ్రోజుల తర్వాత కాలేజినుండి వర్తమానమొస్తే..వెదికి వెదికి.. కాకినాడ భానుసెంటర్‌లో..ప్రశాంత్‌ను పట్టుకుని..

పరిశీలించగా..ఫిజిక్స్ నోట్‌బుక్‌లో ఓచోట రాసిన రాత కనబడింది.

'ఫిజిక్స్ మేడమ్ ఉమ..ఎంత అందగత్తెనో..ఆమె బొడ్డు కిందకు చీర కట్టుకుని, వెనుక విశాలమైన వీపును మావైపు ఉంచి బోర్డ్‌పై రాస్తూంటే.. మనసులో కోటి తుఫాన్లు చెలరేగుతున్నాయి. పాఠం అర్థంకావడం అంటుంచి.. శరీరంలో ఎక్కడో ఏదో అగ్ని అంటుకుని అడవి తగలబడిపోతున్న అనుభూతి కల్గుతోంది..పిచ్చి..పిచ్చి..మెదడంతా మొద్దుబారిపోతోంది..ఉమ..ఉమ.. ఉమ..'

తర్వాత నీరజ 'ఉమ' మేడంను కలిసింది.

ఆమె అందం మగాణ్ణి పిచ్చోణ్ణి చేసేదే..అలంకరణా రెచ్చగొట్టేదే..ఐతే..

బోధనావృత్తిలో ఉంటూ..ఇంటర్ పిల్లల పసి ఎడొలసెంట్ మెదళ్ళపై పడే ముద్ర.. ఒక టీచర్‌కు అంత ఎక్స్పోజర్ అవసరమా.

ప్రశాంత్‌ను బలవంతంగా కాకినాడ నుండి..ఉమ నుండి వేరుగా వరంగల్‌కు తీసుకువస్తున్నపుడు..వాడి శరీరంలోనుండి ఏదో భాగాన్ని కోల్పోతున్నట్టు..విలవిల..ఎంతో బాధ..ఎంతో దుఃఖం..ఎంతో అలజడి.. వ్యాకులత. మనిషి ఒక ప్రాణం లేని బొమ్మ..ఒక టీనేజ్ పసిహృదయంలో ఒక తుఫాను.

ఇంటర్ ఫస్టియర్ వరంగల్‌లో..ప్రతిరోజూ ఒక నిఘా..డేస్కాలర్‌గా.. కాలేజికి ఎలా పోతున్నాడు..ఎక్కడ తిరుగుతున్నాడు..ఏంచేస్తున్నాడు..దర్యాప్తు

ఎటో పోతాడు..కాలేజికి వెళ్ళి మధ్యలో మాయమై ఎటో దుమ్మా..మళ్ళీ రాత్రి ఇంట్లో ప్రత్యక్షం..ముఖం నిండా అలసట..ఘర్షణ..సందిగ్ధత..మనిషిలో ఏదో దహించుకుపోతున్న ఛాయలు..మాట్లాడడు..మౌనం..నిశ్శబ్దం..ఎప్పుడో ఏదో తింటాడు, ఎప్పుడో నిద్రపోతాడు.

ఇంటర్ ఫస్టియర్ చదువులో మాత్రం మళ్ళీ స్టేట్ సెకండ్ ర్యాంక్

'అమ్మా..వంద రూపాయలివ్వు' అంటాడు స్థిరంగా..ఖచ్చితంగా.

ఇచ్చి ఏంజేస్తాడని పరిశీలించింది తను.

ఇంటర్నెట్ పార్లర్‌కు వెళ్ళి...బూతు సైట్‌లను చూస్తూ ఎంజాయ్ చేస్తాడని తేలి షాక్ తింది. రామకృష్ణ టాకీస్‌లో వేసే ప్రతి బూతు మార్నింగ్‌షో సినిమా చూస్తాడని అర్థమైంది.

ఒకసారి వాళ్ళ నాన్న జేబులోనుండి ఐదువందల రూపాయల నోటు కొట్టేసి పోచమ్మమైదాన్ దగ్గర పాన్‌డబ్బాలో మార్ఫియా సిగరెట్లు కొనుక్కొని తాగుతాడని పసిగట్టింది.

'ఎందుకు నాన్నా ఈ అలవాట్లు..ఏమైంది నీకు'

' నా క్లాస్‌లో పద్మ నావైపు క్రైపుగా చూచి ఐ లౌ యూ అంటోందమ్మా.. నాకు పిచ్చెక్కుతోంది..ఎవరికీ చెప్పలేని ఏవో సప్తసముద్రాలు నాలో ప్రళయిస్తున్నాయి. ఇదిగో యీ ప్రేమలేఖ ఇంగ్లీష్ మీడియం ఈశ్వరి రాసింది'

ఇంటర్ చదివే పిల్లల్లో ఈ ప్రేమలేమిటి. ఈ వ్యామోహాలేమిటి, ఈ వెర్రితలలేస్తున్న హద్దుమీరిన ప్రవర్తనలేమిటి?

'టెన్త్‌క్లాస్' సినిమా చూశాను..నరనరాల్లో ఏదో అంటుకుని మండుతోంది. 'ప్రేమ' సినిమా చూశాను..పదవ తరగతి చదువుతున్న అమ్మాయి తన క్లాస్‌మేట్‌తో..ఒళ్ళు జివ్వుమంటోంది. 'కొత్త బంగారులోకం' సినిమాలో ఆ అమ్మాయి, ఆ పిల్లవాడు ఇంటర్‌లోనే గాఢంగా ప్రేమించుకుని లేచిపోయారు గదా..శరీరం నిండా ఏదో విద్యుత్తు.'- ఎక్కడో ఓ నోట్‌బుక్‌లో పెన్సిల్‌తో రాసుకున్న రాతలు.

ఉదయమే ఆరుగంటలకు లేచి..టి.విలో 'ఏరోబిక్స్' షో చూసేవాడు. ..ఫిజికల్ ఫిట్‌నెస్ ఎక్సర్‌సైజ్‌ల పేరుతో మీడియా ఆడదాని ఒంపులనూ, ఎత్తు పల్లాలనూ చూపుతూ..అన్ని చానల్సూ అంతే..

అప్పుడు ప్రశాంత్ ముఖం వేయి వాట్స్ బల్బువలె వెలుగుతూ.,

నీరజ భర్తతో చెప్పేది.

'మగబుద్ధి అంతే–అదేదో నువ్వే చూడు' అని తన దిక్కుమాలిన పోలీస్ కానిస్టేబుల్ క్యాంప్‌లకు వెళ్ళిపోయేవాడు. నెలకు యిరవై ఐదు రోజులు ఔటాఫ్ స్టేషన్ ఆయన.

ప్రశాంత్ అన్నయ్య ఎంబిఏ మొదటి సంవత్సరం..వాడి చదువేమిటో.. వాడి పుస్తకాలేమిటో, వాడి లోకమేమిటో వాడిది.

ప్రశాంత్ అక్కయ్య మెడిసిన్ మూడవ సంవత్సరం..కాలేజికి పోవడం, రావడం, పుస్తకాలు, ఇంట్లో..అంతే.

కాని వీడేమిటి..పేరు ప్రశాంత్. వాడు ఎప్పుడూ ప్రశాంతంగా ఉండడు. ఎవ్వడినీ ప్రశాంతంగా ఉండనీయడు.

అతి సున్నితంగా స్పందించే వీడి తత్వమే యింతగా చంచలపరుస్తోందా.?

ఆ మధ్య 'హ్యాపిడేస్' సినిమా చూశాడు..సడెన్‌గా తన దగ్గరకు వచ్చి 'ఇంజినీరింగ్ కాలేజిలంటే ఆడా మగా పోరగాండ్లు ప్రేమించుకునేందుకు ఉపయోగపడే వేదికలామ్మా..' అన్నాడు..అని 'వాడా సినిమాలో..ఒరేయ్ నీకు గర్ల్ ఫ్రెండేలేదా..నువ్వేం మనిషివిరా అంటాడు' అని గొణుక్కుంటూ వెళ్ళిపోయాడు.

వీడు కూరుకుపోతున్నాడు..బురదలో అని అర్థమైంది నీరజకు.

ఈనాటి యువతరం చుట్టూ ఒక విషవలయం నిర్విరామంగా కోటి కత్తులతో, కోరలతో తిరుగుతూనే ఉంది.

హైస్కూల్ విద్యార్థులు కూడా ప్రేమించుకుని లేచిపోవచ్చని చెప్పే సినిమాలు, షేవింగ్ క్రీం అడ్వర్‌టైజ్‌మెంట్‌కు స్తనాలను ఉబ్బించి స్త్రీని చూపించే ప్రకటనలను గుప్పిస్తూ మీడియా, యాభైశాతంకంటే ఎక్కువ అమ్మాయిలున్న తరగతులతో, కుక్కిన కోళ్ళగంపవలె పోరగాండ్లను బస్సులనిండా నింపుకుని ఒంటిని రాసుకుంటూ, పూసుకుంటూ వచ్చే విద్యార్థులతో నడిచే వందల ఇంజనీరింగ్, ఎమ్బిఏ, ఎమ్సిఏ కాలేజిలు..

ఎవరు ఎవరిమీద పడ్తున్నారో, ఎవరు ఎవరి సెల్‌ఫోన్‌కు బూతు ఎస్సెమ్మెస్‌లు చేస్తున్నారో, కాలేజికని చెప్పి ఏ ఆడమగ పోరగాండ్లు ఎక్కడికెళ్తున్నారో, ఇంటర్‌నెట్‌లో ఎవరు ఎవరితో బూతు చాటింగ్‌లు చేస్తున్నారో..,

ఇరవైలోపు కౌమారదశ..ఒక దూదిముద్ద. నిప్పు రవ్వంటుకుంటే భగ్గుమని ఎగిసే మంట..మరుక్షణం బూడిద–

రోడ్డుమీద నడుస్తూంటే స్త్రీ నగ్నదేహాలతో వందల అడుగుల, వినైల్ హోర్డింగ్‌లు.

పత్రికలనిండా పరమరోత అనాచ్ఛాదిత బొమ్మలు. యువత ఒక వంద రూపాయలనోటుతో చేయి చాపితే మరుక్షణం ప్రత్యక్షమయ్యే బ్లూ సినిమాలు.

మనసులో ఆలోచన పుట్టిందే మరుక్షణం..డబ్బుంటే ఏదైనా అందుబాట్లోకి వచ్చే ఆధునాతన సౌకర్యాలు. ఏ కట్టుబాట్లూ లేని విశృంఖల ప్రవర్తనకు వీలు కల్పించే హోటళ్ళు, పబ్‌లు, లాడ్జింగ్‌లు, రిసార్ట్‌లు..విహార కేంద్రాలు.

స్వేచ్ఛ..స్వతంత్రం..విచ్చలవిడితనం..విశృంఖలత్వం..అరాచకత్వం.. యివన్నీ అంచెలంచెలుగా రూపాంతరం చెందుతూ..

హద్దులేదు..అదుపులేదు..ఎవరి నియంత్రణాలేదు-

నీరజ నడుస్తూనే ఉంది..

చినుకులు పెద్దవై..వర్షమై..వర్షంలో తడుస్తూ..నీరజకు వర్షంలో తడుస్తున్న స్పృహలేదు. ఆమె తలలో ఒక అగ్నిగుండం మండుతోంది.

మనిషి చుట్టూ ఉన్న ప్రమాదాలనుండి ఎవరికి వారే రక్షించుకోవాలి కదా..!

తల్లిగా..ఓ కోడిపెట్టవలె తను తన కొడుకు ప్రశాంత్‌ను ఈ జుగుప్సాకరమైన, అంటువ్యాధుల్లా వ్యాపించే శక్తివంతమైన కలుషిత సామాజిక పర్యావరణంనుండి తన రెక్కలకింద పెట్టుకుని కాపాడుకోవాల్సి ఉంది గదా.. అలా చేసిందా తను..

ఏంజేయగలనురా నా తండ్రీ..నేను తల్లినై ఈ ఇంటర్నెట్ భూతాన్ని ఆపగలనా, ఈ బూతుసినిమాల పిశాచాలను నిలవరించగలనా, దిక్కుమాలిన కో ఎడ్యుకేషన్ కాలేజీల్లో రాసుకుని పూసుకుని తిరిగే అవకాశాల రాక్షసిని ఎదిరించగలనా..పసి మెదళ్ళు కలుషితమై మొగ్గలుగానే రాలిపోతున్న ఎవరి గొంతులను వాళ్ళే నులుముకుంటున్న బీభత్సాన్ని ఆపగలనా...

'వన విజ్ఞాన కేంద్రంలో పోలీసులు పట్టుకున్న పద్దెనిమిది కాలేజి కుర్రాళ్ళ జంటలకు కౌన్సిలింగ్'-అని ఒకరోజు.,

అందులో ప్రశాంత్..ఎవరో మీరా అట..క్లాస్‌మేట్-

పోలీస్‌స్టేషన్‌కు వెళ్ళి..జామీనిచ్చి..సిగ్గుతో ఇంటికి తిరిగి వచ్చిన ఆరాత్రి..ఇలాగే వర్షం.

ప్రశాంత్‌ను సైకియాట్రిస్ట్ దగ్గరికి తీసుకెళ్ళింది..బలవంతంగా తను.

మర్నాడు ఎటో పారిపోయాడు..జాడ తెలియదు. కడుపు తీపి ఆగదు.. వెదికి వెదికి వారం తర్వాత..భీమవరం లాడ్జిలో ప్రశాంత్, వాడి ఇంటర్ ఫస్టియర్ క్లాస్‌మేట్ అఖిల..పెళ్ళి చేసుకున్నారట అన్నవరంలో..

అఖిల తల్లి తండ్రి లబోదిబో..మేజర్ మైనర్ చర్చ..కొద్దాం, తంతాం తతంగం..చివరికి పసుపుతాడు తెగి..ఎవరిదారి వారిది..ప్రశాంత్‌ను లాక్కొచ్చి.,

'ఈ పసి ప్రేమలేమిటిరా భగవంతుడా..'

ఇంటర్‌లో స్టేట్ సెకండ్‌ర్యాంక్ వాడు ఎమ్సెట్‌లో ఎనభై ఐదు వేల ర్యాంక్‌కు దిగజారి..ఓ దిక్కుమాలిన ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజిలో చేరి, గత ఇరవై రోజులనుండి మౌనం..ఏదో తింటాడు, పుస్తకాల సంచి మెడకేసుకుని కాలేజికని వెళ్తాడు..ఎప్పుడొస్తాడో తెలియదు. ఎలా వస్తాడో తెలియదు. ఒకరోజు తాగి వచ్చాడు. మరోరోజు మార్ఫియా సిగరెట్లు తాగి తూలుతూ వచ్చి వీధి చివర కూలిపోయాడు-

లక్షల సంఖ్యలో ఇంజనీరింగ్, ఎమ్బీఏ, ఎమ్సీఎల కాలేజీల్లో చదువుతూ సమర్థులై ఉండి ఉద్యోగాలు పొందుతున్న యువజనం శాతమెంత. ఆత్మహత్యలు చేసుకోకపోయినా అంతర్గతంగా ధ్వంసమైన హృదయంతో ఏ విద్యా ప్రమాణాలు, నైపుణ్యాలూ లేని, గాడితప్పిన స్థితిలో ఒట్టి కాగితపు మనుషులుగా మిగిలిన లక్షలాది యువకుల శాతమెంత.

పేరుకు ఇంజినీర్..వాడికి ఏ వృత్తిగురించీ తెలియదు. పేరుకు ఎమ్బీఏ. వాడికి ఏ నిర్వహణా పాటవం ఉండదు.. పేరుకు డాక్టర్..ఏ నిపుణతా, విశ్వాసం ఉండదు..

పేరుకు రూపాయి బిళ్ల..కాని చెల్లదు-

ఈ శాశ్వత రుగ్మత కాక,..దేశంనిండా హద్దులు మీరిన అవినీతి, నైతిక విలువలే లేని దోపిడి. రాబందులకంటే అధ్వాన్నంగా ప్రజల ధనాన్ని స్వాహా చేస్తున్న రాజకీయులు. ఓట్ల కోసం ఏ నీచానికైనా ఒడిగట్టగల రాజకీయ పార్టీల నాయకులు.

దేశానికి వెన్నెముక కావలసిన యువకులు...శ్రీశ్రీ చెప్పినట్టు 'ఎంతో మంది యువకులు పుట్టుకతో వృద్ధులు'...నిర్వీర్యులు.

దేశానికి మార్గదర్శకులు కాలేకపోతున్న జవచచ్చిన వృద్ధ నాయకులు.. నీతిహీనులైన అధికార వేటగాళ్ళు..పుచ్చు మనుషులు

సెల్‌ఫోన్లలో, వీడియో గేమ్‌లలో, బేకరీ వాకిళ్ళలో, టివీ వాచింగ్‌లో సమాధియైపోతున్న ఈ దేశ బాల్యం..యువతరం

యిక మిగిలింది..?

వట్టి స్మశానంలో మట్టి..

కుండపోతగా కురుస్తున్న వర్షంలో నిశ్చలంగా నడుస్తున్న నీరజకు ఎదుట ఏదో సినిమా తాలూకు నగ్న స్తనాలను జనానికి చూపిస్తున్న పెద్ద యువతి హోర్డింగ్ కనబడ్తోంది.

ఎందుకలా చూపెడ్తోందామె..డబ్బుకోసం.

ఎందుకు చూపెడ్తున్నాడు డెరెక్టర్..డబ్బుకోసం

ఎవరికి చూపిస్తున్నారు ఆమే, వాడూ..పోషకులైన యువతకు.

ఆమె..అంటే ఒక స్త్రీ...

ప్రశాంత్ జీవితంలో ఒక టీచర్‌గా ప్రవేశించి విషబీజం నాటిన ఉమ.. ఒక స్త్రీ..తర్వాత ఇంటర్ ఫస్టియర్‌లో దొంగపెళ్ళి కూడా చేసుకుని ప్రశాంత్ దగ్గర పడుకున్న అఖిల, ఊర్మిళ, ఇంకెవరో పద్మ..స్త్రీలు ఎర్రగా బుర్రగా ఉన్న కుర్రాడి కోసం ఇంకో రమ, ఈశ్వరి..స్త్రీలు. వీళ్ళంతా ఏమటి..ఈ విచ్చలవిడితనమేమిటి. ఇంజినీరింగ్ కాలేజీలకు ప్రతి ఉదయం పరుగులు తీసే బస్సుల్లో అమ్మాయిలు, అబ్బాయిలు ఒకరి ఒళ్ళో ఒకరు కూర్చున్నట్టే ఒరుసుకుని, కరుచుకుని..

ఇది ఉభయదిశల్లో వ్యాపించే వ్యాధి. ప్రశాంత్ మగపిల్లవాడు..అటు ఎవరో ఒక ఆడపిల్ల..ఈ ప్రీ మాచ్యూర్డ్ లవ్ రోగం ఇద్దరికీ ముదిరి మనుషులు చెదలుపట్టిన కట్టెలౌతారు. పైకి అంతా బాగున్నట్టే..లోలోపలంతా బుర్ర..డొల్ల.. మనిషి ఉంటాడు..మనసు చచ్చిపోతుంది. చివరికి జీవచ్ఛవం మిగుల్తుంది.

మూడురోజుల క్రింద..తమ వేపచెట్టు కొమ్మకు పెట్టిన తేనెతెట్టు విషయం జ్ఞాపకమొచ్చింది నీరజకు. క్రితం రోజు ఆనవాళ్ళే లేని తేనెతెట్టు రెండ్రోరోజుల్లోనే పెరిగి పెద్దదై విస్తరించి..బంయ్‌మని ఎన్ని తేనేటీగలో.. అంటువ్యాధీ అంతే..రావడం, ముదరడం, విస్తరించడం..నశింపజేయటం..అంతా క్షణాల్లో..వేగంగా

ఎలా కాపాడుకోగలదు ఏ తల్లయినా తన పిల్లలను ఈ అదృశ్య వ్యాధి నుండి..ఇది ఒక నిశ్శబ్ద విషవిస్తరణ..నరాల్లోకీ, మెదడులోకీ ఎగబ్రాకుతున్న అగ్నిజ్వాల.

రసాయనిక ఎరువులతో కలుషితమైన విషతుల్య ఆహార పదార్థాలను కాదని ప్రకృతిసిద్ధంగా పంటలను పండించి ఆరోగ్యవంతమైన ఆహార దినుసులను అమ్మే 'ఆర్గానిక్ ఫుడ్' షాపులున్నాయిగాని..ఈ యువత మనసును కకావికలు చేస్తున్న సామాజిక కాలుష్యానికి విరుగుడుగా ఇంకేదైనా ప్రత్యామ్నాయ జీవావరణం ఉందా.

చెదలు..చెదలు..చెదలు పడ్తోంది..ఈ యువతకు..ప్రీ మాచ్యూర్డ్ సెక్స్.. సుఖలాలస..జ్వలించే శరీర వాంఛలు..అవినీతి, అశ్లీలం, అనైతికత..ఇవన్నీ చేతికందేంత దూరంలోనే గుట్టలు గుట్టలుగా..ఎలా..ఎలా..

నీరజ వర్షంలోనే నడుస్తూ ఇంటికొచ్చింది.

చీకటి..ఇంటికి తాళం..పిల్లలెక్కడకుపోయారు..కానిస్టేబుల్ భర్త ఎక్కడికి పోయాడు..ప్చ్..తెలియదు.

తాళం తీసి.. చీకటిగా ఉన్న ఇంట్లో అడుగుపెట్టిన నీరజకు ఎందుకో

తుఫానులా దుఃఖం ముంచుకొచ్చింది. బోరుమని బిగ్గరగానే ఏడ్చింది. బిగ్గరగా.. ఇంకా బిగ్గరగా..ఏడుస్తూనే ఉంది.

దుఃఖం మనిషికి కర్తవ్య స్పృహను కలిగిస్తుందా?

* * *

ఆరు నెలల తర్వాత..

ఐటమ్ సాంగ్స్ చేస్తూ, ఒంటి పై గుడ్డల్లేకుండా సినిమాల్లో విచ్చలవిడిగా అంగాంగ ప్రదర్శన చేసే 'మహాలక్ష్మి' అనే సినిమా స్టార్ ఇంటిముందు దాదాపు ఐదువందల మంది మహిళా కార్యకర్తలు నినాదాలు చేస్తున్నారు.

"అశ్లీల ప్రదర్శనలకు మూల కారణం స్త్రీలే"

"స్త్రీ కళాకారుల అశ్లీల ప్రదర్శనలు"–"నశించాలి"

"స్త్రీ నుండే ఈ అశ్లీల ప్రదర్శనల నిర్మూలన"–"ప్రారంభం కావాలి"

"బూతు ప్రదర్శనలు"–"నశించాలి"

"సాగనివ్వం సాగనివ్వం".."అశ్లీల నటనలను సాగనివ్వం"

ముందు వరుసలో..నీరజ ఉంది బిగ్గరగా నినదిస్తూ..నాయకత్వం వహిస్తూ, ఒక చిన్న నిప్పురవ్వ అడవిని దహించగలదుకదా..

తప్పకుండా దహించగలదు..కొంత గాలితోడుకావాలి..గాలి ఉందికదా.. నీ చుట్టూ, నాచుట్టూ..మనందరి చుట్టూ–

●

'స్వాతి' వారపత్రిక